రచన దీపావళి ప్రత్యేక సంచిక - నవంబర్ 2001

# మగచూపు

తారక - తనని ప్రేమించి పెళ్ళాడిన విశ్వాన్ని చూసి ఎంతో మురిసిపోయేది. ఎక్కువగా గర్వపడేది! తనని కాలు కింద పెట్టనివ్వకుండా, ఆపైన తనమీద ఈగను కూడా వాలనీయకుండా జాగ్రత్తలు తీసుకునే విశ్వాన్ని చూస్తే ఆమెకు ఆశ్చర్యం, ఆనందం ఒకేసారి కల్గేవి. విశ్వం, అత్త, మామలు పరోక్షంగా గానీ ప్రత్యక్షంగా గానీ తనని ఏ ఒక్కమాట అన్నా తెగ బాధపడి పోయేవాడు! ముఖ్యంగా తల్లి వెటకారంగా మాట్లాడితే సహించలేకపోయేవాడు.

"పోనివ్వు విశ్వం ... వాళ్ళు పెద్దవాళ్ళు... నువ్వు నన్ను గొప్పగా ప్రేమిస్తుంటే వాళ్ళకు కొంచెం వింతగానూ మరికొంచెం బెదురుగానూ ఉండటం సహజం. ఆడపిల్ల ఎదిగి ఓ ఇంటికి ఇల్లాలు అయి, తిరిగి అదే ఇంటిలో అత్తగారి హోదా, సంపాదిస్తుంది... కానీ అత్తగారయిన వెంటనే మా ఆడవాళ్ళ మనసుల్లో ఓ గుబులు అనేది ప్రవేశించి దెయ్యంలా ఎదుగుతూ ఉంటుందిట...."

"అమ్మ సంగతి వదిలేయ్... నాన్న కూడా నేను నీ కొంగను పట్టుకు తిరుగుతున్నానని విచారగ్రస్తుడవడం, ఆశ్చర్యం... తను మా అమ్మను ప్రేమించి పెళ్ళాడలేదా?? ఆమెను సుఖపెట్టి తను సుఖపడలేదా?? పాతికేళ్ళ వయసులో ఉన్న నేను నీపాలిట - ముద్దు తిరుగుడు, అదే పొద్దు తిరుగుడు పువ్వు నయ్యానని గొణుక్కుంటాడు... ఈపెద్ద వాళ్ళెప్పుడూ ఇంతే, వయసు మీద పడుతుంటే తమ చూపును ఆత్మానుగతం చేసుకోకుండా దాన్ని చిన్న చూపుగా చేసుకుంటారు."

"నువ్వు అనవసరంగా బాధపడుతున్నావ్. దానితోనే రోజు రోజుకు నీకు మతిమరుపు ఎక్కువవుతోంది."

"ఏం కాదు"

"మరి రోజూ తెచ్చే మల్లెపూల పొట్లాం, దవనం కట్టలూ ఏవిట?? చేతులు ఊపుకుంటూ హీరోలా ఇంటికి వచ్చావు. ఇది బావుందా?" అంది చిలిపి నవ్వుతో తారక.

"ఔరా... అవును సుమా... ఎల్లా మర్చిపోయానంటావ్? పూలు రాసులుగా పోసిన దుకాణం దాటి ఈరోజు ఎలా రాగల్గానబ్బా??"

"దార్లో - నాకన్నా నదురుగా ఉన్నది కన్పించేదేమో?"

"నదరుగా చాలామంది కన్పించారోయ్. కానీ వెధవది - నాలో బెదురుంది చూడు దాన్తో తలవంచుకుని వచ్చేశాను" వేళాకోళంగా అన్నాడు.

"ఒట్టినే అన్నాను స్వామీ... అంతా తమాషా. ప్రేమించిన రోజుల్లో ఏ అమ్మాయికీ ప్రియుడు మీద అనుమానం రాదండీ. పుస్తె కట్టించుకున్న తర్వాతే. ఆశ్చర్యంగా అనుమాన పిశాచం గుండెల్లోకి దూరి కూర్చుంటుంది."

"సృష్టి రహస్యం అంతా ఇక్కడే చక్కని చిక్కుముడులయి కన్పిస్తుంది. ఆడది కళ్ళు పెద్దవి చేసినా, ఒక్కటంటే ఒక్క కన్నీటి చుక్క రాల్చినా మగవాడు తట్టుకోలేడు. కానీ చూడు. అదే మేం జుట్టు పీక్కున్నా కాళ్ళు పట్టుకున్నా మీరు ఎంతో ఆలస్యం చేసిగాని నవ్వుల పువ్వుల్ని పక్కమీద రాల్చరు...."

సరిగ్గా అప్పుడే తల్లి, డ్రాయింగ్ రూమ్‌లోంచి, "విస్సిగా" అని పిల్చింది.

"అదిగో – మీ అమ్మగారు ఫస్ట్‌బెల్ కొట్టారు. వినబడిందా?"

"రెండోసారి పిలవనీ చూద్దాం."

తారక అల్మైరా తెరిచి డబుల్‌కాట్ మీద తెల్ల దుప్పటి పరిచింది. డ్రెస్సింగ్ టేబిల్ దగ్గరకు వెళ్లి జడవిప్పి, తల దువ్వుకుంది. పౌడర్‌తో మొహాన్ని, మెడను, చేతుల్ని పరిమళాన్వితం చేసుకుంది.

"ఆ చీర ఏం బాగోలేదు... అది మార్చు..."

"దీనికేమయ్యింది... శుభ్రంగా ఉందిగా?"

"కటావ్ వారి తెల్లవాయిల్ చీర కట్టుకో... అలాగే ఆ అమ్మ జాకెట్ విప్పేయ్."

"ఇంకా?"

సరిగ్గా అప్పుడే డ్రాయింగ్ రూమ్‌లోంచి ఈసారి తండ్రి "విశ్వం" అని పిల్చాడు.

"పెద్దాయన" అంది నెమ్మదిగా తారక చీర మార్చుకునే ప్రక్రియలో.

"వెళ్ళి నిద్రపోతున్నాని చెప్పిరా..."

"నే ఇలా వెడితే నా అవతారం, అలంకరణా చూసి, మీరు నిద్రపోవడం లేదని కనిపెట్టేస్తారు... నాకు సిగ్గుగా ఉంటుంది. నువ్వే వెళ్ళిరా."

"పోనీ – 'ఏం కావాలి అత్తయ్యా' అని పరోక్షంగా తలుపు సందుల నుంచి అడుగు" – విశ్వం సలహాతో నవ్వు జతకల్పాడు. తారక విశ్వాన్ని వెక్కిరించింది. అందంగా, అంతలోనే "ఆ మందులు ఏమిటో... ఏది ఎప్పుడు వేసుకోవాలో తెలియడం లేదు. తారకా.... వాడ్నోసారి ఇటు రమ్మనమ్మా" అంటూ చాలా మృదువుగా, సౌమ్యంగా, అత్తగారు ఫైనల్ కాల్ యిచ్చింది.

"తప్పదు వెళ్ళిరా"

"నా బొంద" అనుకుంటూ విశ్వం వాకిట్లోకి వెళ్ళి మందు సీసాలు విప్పి రెండు రకాల బిళ్ళలు తల్లికి ఇచ్చాడు.

"నువ్వు నిద్రపోయావనుకున్నాను."

"లేదు.... ఏదో ఆఫీసు పని చూసుకుంటున్నాను."

తండ్రి ఓసారి ఆవలించి, "అవునూ" అన్నాడు కొడుకును పరీక్షగా చూస్తూ! విశ్వానికి 'ఏమిటీ' అని అడగబుద్ధి వేయలేదు. జవాబులు చెప్పడం మొదలు పెడితే తండ్రి ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఉంటాడు.

"నీతో మాట్లాడాలి. ఓసారి కూర్చో."

విశ్వం వాచి చూసుకుని తండ్రి అర్థం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో పెద్దగా ఆవలించాడు.

"తొమ్మిది కాకుండా నిద్రవస్తోందేరా?"

విశ్వం మాట్లాడలేదు.

"మీ కబుర్లు వేళాపాళా లేదు. మనకయితే వయస మీదపడిన మూలంగా నిద్ర తగ్గుతుంది... కుర్రాళ్ళకు అలా కాదు."

"నిన్ను చెప్పమనలేదు" అన్నాడు పెద్దాయన.

"బావుంది. మీతో ఏం మాట్లాడినా కష్టమే...."

"నీ మాట తీరు అంత"

అలా భార్యా భర్తలు వాదులాడుకుంటుంటే విశ్వం, "నే వెడతాను, అమ్మా" అని అప్పుడే వచ్చిన ఆవలింతను చేత్తో ఆపుకుంటూ చటుక్కున పడగ్గదిలోకి రాటుదేలిన దొంగలా దూరిపోయాడు.

తారక అప్పటికే తలక్రింద చేయి పెట్టుకుని ఓ కాలిమీద మరో కాలు వేసుకుని గుమ్మం వైపు చూస్తూ ముద్దుగుమ్మలా వుంది. విశ్వం ఆమెను చూసి, ఆమె మూగ ఆహ్వానానికి ముగ్ధుడయ్యాడు. వేగంగా మంచం దగ్గరికి చేరాడు. వెంటనే ఆమె పక్కన చోటు చేసుకుంటూ కూర్చుని - ఆపైన పడుకుని - తారక బుగ్గమీద చిన్నగా తట్టి ఆమెను తనలోకి తీసుకున్నాడు.

"అయ్యిందా మాతా పితల సేవ"

"అయ్యింది గానీ మరొకటి బాకీ పడ్డాను"

"ఏమిటీ?"

"అర్థాంగికి అనురాగ సేవ."

"అమ్మో.... ఈవేళ కవిత్వం వస్తోంది."

"నా కవిత్వానికి నువ్వు పట్టుకొమ్మవి తెలుసా?" విశ్వం నవ్వులోతారక నవ్వు కలిసి అక్కడ యుగళ హాసానికి తెర లేచింది.

"నిన్ను పెళ్ళాడిన తర్వాతే నాకు జీవితం అంటే అర్థమవడం మొదలు పెట్టింది."

"నేనూ అదే అనుకుంటూంటాను."

"మా అమ్మా, నాన్నా పెద్దవాళ్ళు కాస్తంత, పిసరంత చాదస్తం. కానీ మంచి వాళ్ళు. అవును కదూ!" అన్నాడు. తారక మెడలోని పూలదండలోంచి ఓ పూవును తెంపుతూ, విశ్వం.

"ఆ మంచివాళ్ళ కన్నా నువ్వు మరింత మంచివాడివి."

"మరి నువ్వెవరివో చెప్పనా?" అన్నాడు లాలనగా విశ్వం.

"చెప్పు"

"నా పాలిట చంద్రముఖివి."

❖ ❖ ❖

విశ్వం ఒక్కడూ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాడు. అరగంటగా ఆలోచిస్తూనే ఉన్నాడు. అయినా అతనికి ఏం చేయాలో తోచింది కాదు. ఆఖరికి విసుగేసి తల అటూ, ఇటూ తిప్పగా తిప్పగా మధ్యే మార్గంగా తట్టినది తారకతో చెప్పాడు. ఆమె విశ్వం చెప్పిందంతా విని "చాల్లెండి, వద్దు.... అమ్మో" లాంటి మాటలతో అన్నిటిని కాదంది. నచ్చచెప్పబోయింది.

"నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను – తారకా."

"చూడండి... మీరు తొందరపడి ఈ నిర్ణయానికి వచ్చారని నేనంటే – మీకు కోపం వస్తుంది... మన సంపాదన ఎంత? మన తాహతు ఎంత? వాళ్ళ దగ్గరా వీళ్ళ దగ్గరా అప్పుచేసి బ్యాంక్‌లో ఎడ్యుకేషనల్ లోను తీసుకుని – ఆపైన డొనేషన్ కట్టి వాసుకు యం.బి.బి.యస్ చెప్పించడం దేనికండీ. వాడుమనకు ఒక్కడే కొడుకు కాదు కదా... ఈ ఏడాదిలోనయినా జానక్కి పెళ్ళి చేయగల్గితే మనం ధన్యులమే. ఇప్పటికే ఆలస్యం చేశాం. ప్రస్తుతం కట్నాలు, వాటి పెరుగుదలా ఎలా ఉందో వింటే భయం వేస్తోంది...."

"వాడి చదువు అయిన తర్వాత ప్రాక్టీసు పెడతాడుగా... వాడే రెండు చేతులా గణించి చెల్లెలు పెళ్ళి చేస్తాడు..."

"వాడు బి.ఎస్సీ పాసయ్యాడు. అదీ సెకండ్ క్లాసులో... యం.ఎస్సీ చెప్పించండి. చాలు! లక్షలు డొనేషన్లు కట్టడం, అనవసరం... అయినా జానకి పెళ్ళి బాధ్యత మనదండీ, అంతేగానీ – రేపు ఏదో అవబోతుందని గాలిలో దీపాలు పెట్టద్దు..."

"నువ్వు నేను ఏం చెప్పినా వినవు, తారకా... నాకు తెలుసు..."

"ఎందుకు విననండీ... " అని తారక చిన్నగా నవ్వి, కానైతే నేను మీలా కాదు, మీరు చెప్పిందంతా వింటాను. ఆలోచిస్తాను. అందులో ఉన్న ఇబ్బందులు 'యివీ' అని చెప్తాను.. మీకు అది కిట్టదు... అవును కదూ..." అంది.

"ఏమో... నాకయితే వాడ్ని డాక్టర్ చేయాలని ఉంది."

"అయితే మీ ఇష్టం...." అనేసి తారక కుర్చీలోంచి లేచింది.

"మరో సంగతి ఉంది... మన ఊళ్ళో ఉన్న అర ఎకరం పొలం అమ్మేస్తాను. ఎంతో కొంత డబ్బు వస్తుంది... ఆ డబ్బు జానకి పెళ్ళికి ఉపయోగపడుతుంది...."

తారక మాట్లాడలేదు.

"ఏమంటావ్?"

తారక నవ్వేసి అంది... "ఓసారి గుర్తు చేసుకోండి. మన పెళ్ళినాటికి మీ నాన్నగారు

రెండు ఎకరాల ఆసామి!! ఎవరేం చేసినా ఏం జరిగినా అది ఈనాటికి తరిగి మీ వాటాగా అరెకరం అయ్యింది. ఇక మీకు మహా ఉంటే పన్నెండేళ్ళ సర్వీసు మిగిలింది. జీతం పెరుగుతోంది. కానీ జీతంతో పాటు ఖర్చులూ పెరిగాయి. అలాంటప్పుడు...”

“ఆగిపోయావేం?”

“మొన్నటికి మొన్న ఐదు లక్షలు పెట్టి ఫ్లాట్ కొనడానికి తయారయి, ఎడ్వాన్స్ ఇచ్చారే.. ఈ ఆలోచన మీకెలా వచ్చింది. అయినా నేను చెప్పాను - వద్దని విన్నారు కాదు...”

“మనకని ఇల్లు ఒకటి ఉండాలిగా.”

“నిజమేనండీ... అప్పు మీద అప్పు చేసి ఇలా ఎన్ని పన్లు చేస్తారు? దీనికి అంతెక్కడ... వద్దండీ... ఇల్లు కొనే ఆలోచన ఆపుజేయండి... మనం కాస్త ఊపిరి తీసుకున్న తర్వాత చూసుకుందాం...”

“అదిగో మళ్ళీ అడ్డుపుల్ల వేస్తున్నావ్?”

“ఇది అడ్డుపుల్ల ఏం కాదు....”

“కాక మరేమిటట...” విశ్వం విసుగ్గా అని వెంటనే తనని తను సంభాళించుకుంటూ, “ఒక్కొక్క సారి నిన్ను చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంటుంది - తారకా!! పూర్వంలో నేనేం చెప్పినా - ఇట్టే తలూపేదానివి. ఇంట్లో ఏ గొడవలూ ఉండేవి కావు.. ఈ మధ్యే కొత్త గొంతుక అలవాటు చేసుకున్నావ్.” అన్నాడు.

తారక నవ్వింది - జవాబుగా!!

“ఏదైనా అంటే నవ్వడం, లేకపోతే దెప్పి పొడవడం, చేస్తావ్...”

“నవ్వితే నవ్వానంటారు. ఏడిస్తే ‘అదిగో ఏడుస్తున్నావ్’ అంటారు. ఎలా చచ్చేదండీ, మీతో! నిజానికి నేను కాదు మారింది - మీరు!! నెమ్మదిగా మీ అమ్మ, ఆ మహా తల్లిగారి బుద్ధులన్నీ పుణికి పుచ్చుకున్నారు. ఆవిడా అంతే - కోడలు చెప్పడం ఏమిటి’ అనే గర్వంతోనే మాట్లాడేవారు. ఇక మీ నాన్నగారిలా ఆ ఒక్క ఘనకార్యానికి కూడా అలవాటు పడ్డారంటే - వేరే చెప్పనవసరం లేదు.. మన పని గోవిందే....” నవ్వేసింది.

“మధ్యలో మా నాన్నని ఎందుకు ఎత్తుతావ్?” ఉడుక్కుంటూ అన్నాడు, విశ్వం....

“కొడుకుగా, మీరు ఆయన మంచి బుద్ధుల్ని, ఆదర్శాలను పుణికి పుచ్చుకుంటే బాగానే ఉంటుంది. అంతేగాని ఆయనలా” అని మాటలు ఆపి పక పకా నవ్వేసింది తారక.

“చాల్లే - నీ ఉపన్యాసాలు! ఆ టిఫిన్ బాక్స్ ఇస్తే నేను ఆఫీసుకు పోతాను.”

“ఉపన్యాసాలు కాదు స్వామీ... నన్ను అర్థం చేసుకోండి... భార్యా భర్తల మధ్య అపోహలు వచ్చినా ఫర్వాలేదు. ఘర్షణలు తలెత్తినా తప్పులేదు. కానీ ఆఖరిగా ఇద్దరిదీ మాత్రం తలోదారీ కాకూడదు. పది నిముషాలపాటు పంతాలకు పోయినా పదకొండో నిముషాన రాజీ పడగల్గాలి...”

“అనదల్చుకున్నవన్నీ అని - వెంటనే నంగనాచిలా చక్కగా మాట్లాడ్డం, నీకే చెల్లింది...

ఏమో అనుకున్నా... అమ్మో.. నువ్వు గడుసుదానివి, చాలా చాలా.”

“మీకన్నానా? మీరు చాపకింద నీరుకాదా? చలి తేలుకు నకలుకాదా, స్వామీ.”

“ఇంకా నయం తాచుపామునని కూడా అనెయ్యి...”

“అంత మహాపాపానికి ఒడిగట్టను లెండి”

“అవును నాకు తెలుసు. నువ్వు మొగుణ్ణి బుట్టలో పెట్టి మూతేయగలదానివే. నేను వెడుతున్నాను....” అంటూ విశ్వం బూట్లు తొడిగాడు.

“ఇదిగో చెప్తున్నాను. బాగా చెవిపెట్టి వినండి. ఇంతకాలం జరిగిందేదో జరిగింది. మీరు ఆఫీసు అవగానే నేరుగా ఇంటికే వచ్చెయ్యండి. క్లబ్‌కు వెళ్ళద్దు. అక్కడ పేకాట ఆడొద్దు.... పైగా ఈవేళ ఫస్ట్ తారీఖు... జీతం ఒక్కటే కాదు, దానితో పాటు పే స్లిప్ కూడా తీసుకురండి.... మర్చిపోవద్దు” అంది బెదిరింపుగా తారక.

“నాకు తెలుసు... నీకు నా మీద నమ్మకం పోయింది... లేకపోతే ఇంత చేటు మాట్లాడతావా? సరే చూద్దాం... ఏది అవ్వాలో అదే అవుతుంది” అంటూ ఉక్రోషంగా చూశాడు విశ్వం, తారక వైపు. ఆపైన గుమ్మం దిగాడు చేతులు ఊపుకుంటూ...!!

అయితే ఆ ఊపిన చెయ్యి కాస్తా వెళ్ళి మంచం పక్కనున్న టీపాయ్ తగలడంతో అతనికి మెలకువ వచ్చేసింది. విశ్వం ఓసారి చుట్టూ చూసి కళ్ళు నులుముకున్నాడు. ఆపైన పక్కకి తిరిగాడు. పక్కనే పడుకుని ఎడం చేయి తన గుండెలమీద వేసి పసిపాపలా నిద్రపోతున్న తారక కన్పించింది!! అతనికి వెంటనే నవ్వు వచ్చింది. ఆమె మొహంకేసి చూశాడు!! ఆమె మొహం మీద చిరు చెమటలు... ఆమె నిశ్వాసం ఉండుండి చిన్నగా మొహానికి తగిలి ఏవో గుసగుసలు చెప్తోన్నట్టుగా ఉంది...

తను పెద్దవాడినయి పోయినట్టు, తారక కూడా ఎదిగి అదోలా మారినట్టు దాంతో ఇద్దరి మధ్యా కొత్త కొత్త చిటపటలూ, సరికొత్త కలహాలూ చోటు చేసుకున్నట్టూ... అలా తనకా కల ఎందుకు వచ్చిందో – విశ్వానికి ఎంత ఆలోచించినా అర్థంకాలేదు. ఆమె చంద్రబింబంలాంటి మొహంచూసి ఇట్టే మెతకబారే తను, ఎదిగిన తర్వాత, అదే తారకను సూర్య ముఖిలా తలపోస్తూ, ఓ కొత్త అవతారం, స్థితిని ఎందుకు ఎత్తవల్సి వస్తుందో– అదీ అర్థం కాలేదు... అలా కాసేపు అయోమయావస్థలో ఉండిపోయాడు!!

కానీ మగవాడికి వయసు మీద పడుతూంటే అతని మనసు వాకిలి మరింత విశాలమైనా కావచ్చుననీ, కానిచో అది నెమ్మది నెమ్మదిగా అసహ్యంగా ఇరుకూ అవొచ్చుననీ అదంతా మనిషి అహంకారపు ఎత్తుమీదా, లేక అతని ఆలోచనా సరళి సరళత మీదా ఆధారపడి ఉంటుందని – ఆ సమయంలో, ఆ వయసులో విశ్వానికి తోచలేదు.

❖ ❖ ❖

విశ్వం అద్దం ముందు నిలబడి, గ్లేరింగ్‌గా నెరుస్తున్న జుట్టును దువ్వుకుంటూ ‘ఏమిటో తల నెరిసిపోతుంది’ అనుకున్నాడు స్వగతంగా! అక్కడే కూర్చుని కట్టర్‌తో కేరట్ దుంపలు

తరుగుతున్న తారక - విశ్వం అద్దం ముందు చేసే ఏకపాత్రాభినయం చూసి చిన్నగా నవ్వేసి అంది. "చూస్తున్నాను. మీకీ మధ్య ఇదో కొత్త బాధ పట్టుకుంది. వయసు వస్తూంటే తల నెరుస్తుంది. సహజంగా, అయితే, వినగల్గితే ఆ నెరిసిన తలే సలహాలూ, సందేశాలూ చెప్తుందట.

"దాని సంగతి ఏమోగాని.... ఈ మధ్య తరుచు నువ్విచ్చే సలహాలు విని విని వాటిని తలకు పట్టించుకున్న మూలంగానే నా జుట్టు ఇలా వేగంగా నెరవడం జరుగుతోంది..."

"అదేం కాదు... తమకు యాభై ఏళ్ళు ఎప్పుడో దాటిపోయాయి, మహాశయా... అదీ కారణం..."

విశ్వం వెనక్కి తిరిగి తారకను చూశాడు. తల వంచుకుని కూరలు తరుగుతున్న మూలంగా ఆమె పాపిడికి అటూఇటూ నెరుస్తూన్న పాయల్ని చూసి, "అవునూ నీకూ తల నెరవడం మొదలయ్యింది.... ఇద్దరం తలకు రంగు వేసుకుందాం. బావుంటుంది. ఏమంటావ్?" అని అడిగాడు, ఆమెకు దగ్గరగా కూర్చుని....

"నాకేం షోకులు అవసరం లేదు. అలాగే మీరు తలకి రంగు వేసుకోవద్దు... మనమేం చిన్న పిల్లలమా... మనవల్ని ఎత్తాం..."

విశ్వం అరగంట తర్వాత అన్నం తిన్నాడు. బట్టలు వేసుకున్నాడు. ఆపైన నోట పక్కపొడుం వేసుకుని, "ఓసారి ఇటు వస్తావా?" అని కేకేశాడు. తారక రెండు నిముషాల్లో విశ్వానికి టిఫిన్ బాక్స్ తయారు చేసి హాల్లోకి వచ్చింది.

"అలా కూర్చో"

తారక కూర్చుంటూ "ఏమిటీ ఆఫీసుకు టైం కాలేదా?" అని గడియారం వైపు చూసింది.

"వెడతాను... కానీ .. నువ్వు నిన్న ఏదో అన్నావ్? అదేమిటీ..."

"అదా.. మీతో మన వాసు గురించీ, జానకి గురించీ చెప్పానండీ... పండక్కి అందర్నీ ఈసారి ఇక్కడకు రమ్మనమని ఉత్తరం వ్రాయండి...."

"వాడికి ప్రతీ పండక్కీ అత్తవారింటికి పోవడం అలవాటు.. ఉత్తరం వ్రాసి ఏం ప్రయోజనం?"

"పూర్వం సంగతులు వదిలేయండి నాకు మనవణ్ణి చూడాలని ఉంది..."

"నీకూ కోడలికీ పడదుగా... ఎందుకొచ్చిన గొడవ...."

"నాకేం గొడవలు లేవు. నిజానికి మీకే అల్లుడంటే కిట్టదు..."

"అలా అని మన జానకి నీతో చెప్పిందా?... ఈ రోజుల్లో అల్లుళ్ళు చాలా తెలివైన వారు... భార్యలతో లాలూచీ పడతారు.. అతగాడేమో మన ఎదురుగానే మన అమ్మాయిని తిడతాడు. అదేమో కన్నీళ్ళు పెట్టుకుంటుంది. మనలాంటి అత్తమామలేమో వెంటనే బెంబేలు ఎత్తిపోయి - కట్నాలూ, కానుకలూ గుమ్మరిస్తాం.... క్రికెట్‌లోనే కాదు ఈ మేచ్

ఫిక్సింగ్ తతంగం ఉండేది. ఈ రోగం ఇళ్ళల్లోకీ, కొత్త సంసారాల్లోకి జొరబడింది. దీన్ని అరికట్టడానికి ప్రభుత్వం మొత్తం రాజ్యాంగాన్ని సమీక్షించ రావొచ్చు త్వరలో..."

"చాల్లెండి... హాస్యానికయినా హద్దూ, పద్దూ ఉండాలి. మీ రోజులకు తగ్గ అల్లుడిగారి జులుం మీరు చూపించారు కదా... ఈరోజుల్ని బట్టి – వీళ్ళు ... అంతే"

"అయితే నీకు మద్రాసు రైలుకు టికెట్ కొనమంటావా?"

"నాకు ఒక్కదానికీనా? మీరూ రాకూడదు. ఇద్దరం వెడదాం"

"నాకు వీలు పడదు. ఇది ఫైనాన్షియల్ ఎన్డింగ్ రోజులు. ఆఫీసరునయి నేను సెలవుపెడితే కంపెనీ బేలన్స్ షీటే గతి అంతే అవుతుంది..."

"ఇది పాత పాటే... ఎప్పుడు పాడుతూనే ఉంటారు."

"అంటే నా మాటలు అబద్ధం అంటారా?"

"సరే – నేనూ మద్రాసు వెళ్ళను. టికెట్ కొనద్దు..."

"నీకేమయిందని... హాయిగా వెళ్ళిరా రాదా?"

"అలా అంటారా?" అని తారక, ఓ నిముషం సేపు భర్త మొహం చూసి, "నువ్వు వెళ్ళద్దూ... నాకు ఇక్కడ ఒక్కడికి ఇబ్బందీ... మనిద్దరం రెండు నెలలు తర్వాత ఉగాదికి కలిసే వెడదాం అంటారనుకున్నాను.. ఏదైనా మనసులో ఉండాలండీ... మీ సంగతి తెలిసీ వెర్రిదానిలా నేను బయటపడుతూ, బాధపడుతూ ఉంటాను..."

"ఇదేమిటి నీ గొంతుకలో కొత్త శ్రుతులు విన్పిస్తున్నాయి?"

"అవును నాది కొత్త గొంతుకేనండి... చెప్పండి – నిజానికి మీకు కాఫీ కలుపుకోవడం వచ్చా... రాదే... అన్నం ఎలా వండుకుంటారు... అదీ చేతకాదే.."

"అదా! ఓసినీ... దీనికా యిన్ని మాటలు మాట్లాడావ్" అన్నాడు నవ్వుతాలుగా, విశ్వం.....

"మన వీధిలో తెలుసున్న వంటవాడు వున్నాడు.. రెండు పూటలా వండిపెడతాడు. మాట్లాడనా." నెమ్మదిగా అడిగింది తారక.

"వద్దులే... మా కేంటిన్‌లోనో,హోటల్లోనో తింటాను."

"అవునులెండి... ఆఫీసులో – మీ పక్కన కూర్చుంటుంది. అసిస్టెంట్ సెక్రటరీ వర్ధనమ్మగారు. ఆవిడ నాలుగిళ్ళ అవతలేగా ఉంటున్నది.....వాళ్లింట్లో రెండు పూటలా భోజనానికి గెస్ట్‌గా రమ్మనమందా?"

విశ్వం తారక వైపు కోపంగా చూసి, "తారకా నీకు మతిపోయిందా? ఆవిడ నాకెందుకు అన్నం పెడుతుంది.... వాళ్ళిల్లు ఫాస్ట్‌ఫుడ్ సెంటరనుకన్నావా?"

"పాపం ఆవిడకు భర్త లేడు... ఏకాకి... ఆఫీసులో మీలాంటివాళ్ళ అండదండలతో జీవితం వెళ్ళదీస్తోందని విన్నాను...."

"వ్యంగ్యంగా, వెటకారంగా మాట్లాడవద్దు... ఎవరైనా వింటే బావుండదు.."

"ఆఫీసులో కొలీగ్స్ కదా... కలిసి తిరిగినా అలా ఒకరి కంట పడినా ఏమీ కాదుగా...

కొత్త రోజులు - యివి!"

"సరే... నీఇష్టం వచ్చినట్టు అనుకో... నాకు ఆవిడంటే ప్రాణం... నీ కన్నా ఎక్కువ. ఏం చేస్తావ్?"

"తెగించానని తమరే చెబుతూంటే నేనేం చేయగలను? కాసేపు ఏడుస్తాను. అంతగా అయితే వాసుకు ఓ ఉత్తరం వ్రాసి పడేస్తాను - 'మీ తాతగారిలాగే మీ నాన్నగారు కూడా తయారయ్యార్రా... అప్పుడు ఏడవడం మీ బామ్మవంతు అయితే ఇప్పుడు ఆ కర్మ నాకు పట్టిందిరా. నువ్వు మీ నాన్నను దారిలో పెట్టగలిగితే మంచిది... లేకపోతే.." అని ఆగిపోయింది తారక.

"నోరు మూస్తావా... తారకా... ఇలా రాక్షసిలా తయారయ్యావేమిటి" అన్నాడు విశ్వం కోపంతో ఊగిపోతూ.

"మీరు అబద్ధం ఆడుతూ, నాకు ద్రోహం చేస్తున్నారు."

"చాల్లే, ఊరుకో..."

తారకకు ఉడుకుమోత్తనంతో కళ్ళ నీళ్ళు తిరిగాయి. కాసేపు తల వంచుకని ఉండిపోయి, అంతలోనే తేరుకుని, "ఇన్నేళ్ళయ్యింది... ఎప్పుడయినా ఇలా నా మీద మండిపడ్డారా? తిట్టారా? కానివ్వండి... నా దారిన నేను పోతాను. ఇక్కడ ఉండను. షిరిడీనో, పుట్టపర్తో వెళ్ళిపోతాను."

"ఊరుకో... నన్ను విసిగించకు తారకా... నీ ఇష్టం వచ్చినట్టే చేసుకో..."

"అలా అంటారా ... సరే" అంది కళ్ళ నీళ్ళు తుడుచుకంటూ... ఆ పైన కుర్చీలోంచి లేవబోయి కొద్దిగా తూలి, పక్కకు పడబోయి 'ఆ' అని చిన్నగా అరిచింది!

అంతే ఆమె కల చెదిరింది. తృళ్ళిపడి లేచింది. చుట్టూ చూసింది... ఆ గదిలో ఉన్నది తనే... పక్కన ఉన్నది - విశ్వమే... అతగాడు ఏభై ఐదేళ్ళు దాటి వయసు మీద పడ్డ మనిషి కాదు... తను అమ్మమ్మా కాదు. 'ఇదేమిటి ఇలాంటి పాడు కల ఎందుకు వచ్చినట్టూ' అనుకుంది మనసులో! మంచం పక్కనున్న టీపాయ్ మీద మంచి నీళ్ళ గ్లాసును అందుకుని కొద్దిగా తాగి గాఢ నిద్రలో ఉన్న విశ్వాన్ని మరోసారి చూసింది... చటుక్కున ఆమెకు ఏడాది నాడు కాపురానికి బయలుదేరే ముందు రోజు తనని ముద్దుగా పెంచి తననో మనిషిగా తీర్చిదిద్దిన అమ్మమ్మ వీడ్కోలుగా ఎన్నో హితవాక్యాలు చెప్పింది. అందులో ఆశ్చర్యకరమైన విషయాలూ ఉన్నాయి... "ఒసే, తారకా, మనవరాలా చెప్తున్నాను విను. చెప్పింది బాగా గుర్తు పెట్టుకో... మగవాళ్ళ మనస్తత్వం గమ్మత్తయనది. అదో రంగు రంగుల గాలిపటం... వాళ్ళు పెళ్ళయిన కొత్తలో భార్య అంటే ప్రాణం పెట్టినా, ఆ తర్వాత రకరకాల పోకడలు పోతూంటారు. పెళ్ళాం మీద ప్రేమ పల్చబడు తూంటే ఆత్మ విమర్శ చేసుకోకుండా - చిన్న చిన్న అసంతృప్తుల్ని పెద్దవి చేసుకుని ఇట్టే పక్కదారులు పట్టి పోతారు. జాగ్రత్త ... మనవడి మీద ఓ కన్నేసి ఉంచు. నీ కనుసన్నలు

దాటిపోకుండా అతగాణ్ణి కాపాడుకో..." అంది రహస్యంగా.... తారక ఆ క్షణాన నవ్వి ఊరుకున్నా - ఓ నాడు కాలేజీలో జరిగిన సెమినార్‌లో ఊళ్ళో ఉండే పెద్దమనిషి అధ్యక్షుడిగా వచ్చి చెప్పిన మచ్చుతునకల్లాంటి విషయాలు కూడా గుర్తొచ్చాయి. ఆమె ఆనాడు ఆ మాటలతో కాస్తంత విస్తుపోయింది. దాని సారాంశం ఒకటే! ఆయన నవ్వుతూ... "సృష్టిలో వింతైన జాతి, మానవులదే! అందులో పురుషుడు మరీ ఆశ్చర్యకరమైన స్పెసిమన్!.. అతగాడు తెలివిపరుడు. బలాఢ్యుడు. కానీ ఆడదాని ముందు మాత్రం రకరకాల అభినయాలు చేసే గారడీవాడని చెప్పుకోవాలి! ఉదాహరణకి - మగవాడికి పెళ్ళయిన కొత్తలో తన భార్య ముమ్మార్తులా చంద్రముఖిగా కన్పిస్తుంది... దాసోహం అవడానికి కూడా వెనుకాడడు. కానీ ఆశ్చర్యం ఏమిటంటే, తను కాలంతో పాటు ఎదుగుతూ - భార్య ఎదుగుదలను సహించలేకపోతాడు. ఆ అసహనంతో అతగాడు భార్యను 'సూర్యముఖి' అనుకుటాడు... తను ఆమెకు దగ్గరగా వెళ్ళకుండా తనకు దగ్గరగా వచ్చిన ఆమెను కూడా దూరపు మనిషిగా లెఖ్ఖలు కట్టి జుట్టు పీక్కుంటాడు! ఇక వయసు మీద పడి ముదిమితనంతోఉన్నా, తనలోని అహంకారానికి పెద్ద పీట వేస్తూనే ఉంటాడు... వటవృక్షంలా సంసారం విస్తరించినా - లేక ఆ వృక్షంలో అక్కడక్కడా ఎండు ఛాయలు కనబడినా అందుకు కారకురాలు భార్యే అనుకుంటాడు. అప్పుడు అతనికి తన జీవన సహచరి 'జ్వాలాముఖి'గా అన్పిస్తుంది. ఇదీ మా మగవాళ్ళ తంతు..."

ఆయన మాటలకు అందరూ చప్పట్లు కొట్టారు... ఆయన ముగింపుగా "నిజం చెప్పాలంటే, మగవాడు - రోజుకు తొంభై తప్పులు చేస్తే - ఆడది పది తప్పులే చేస్తుంది - అదీ తప్పనిసరి పరిస్థితుల్లోనే! అందుకే వాళ్ళను చిన్నచూపు చూడొద్దు. అలా చేసి మనల్ని మనం దిగజార్చుకోవద్దు... అయినా నా ఉపన్యాసం ఇక్కడ ఉన్న అన్యోన్య దంపతులకు బాధ కలిగించదనీ - భార్యాభర్తలు అంతటా ఇలానే ఉంటారని ఓ రూలింగ్ ఇవ్వడం తన ఆంతర్యం కాద"ని చెప్పి ఆయన సభికులకు నమస్కారం చేశాడు..!!

తారక తన ఆలోచనల నుంచి తేరుకుని పక్కనున్న విశ్వాన్ని చూసింది. ఆమె పెదాల మీద చిన్నపాటి నవ్వు కదిలింది... విశ్వం ఈ తరం యువకులకు ప్రతినిధి అనీ - అతన్ని చూసి తను నిత్యం గర్వపడుతూనే ఉంటుందనీ అంతేగానీ ఏనాడూ, ఏ వయసులోనూ విశ్వం తనని చిన్నచూపు చూడడనే ఆశాభావంతో బలంగా ఊగిపోయి, ఆ పైన బలవంతంగా విశ్వాన్ని నిద్ర నుంచి లేపి, అందంగా, అద్భుతంగా అతనిలో ఐక్యం అయ్యింది!! తెలతెలవారుతూంటే నెమ్మదిగా నవ్వుతూ తనకు వచ్చిన కల గురించి విశ్వానికి చెప్పింది! విశ్వం ఆశ్చర్యపోయి ఆ తరువాత - "ఆ మధ్యన నాకూ ఇలాంటి పీడకలే వచ్చింది... నీకూ వచ్చిందా? అయితే ముందు నేనే జాగ్రత్తగా ఉండాలన్నమాట" అంటూ నవ్వేశాడు. తారక అతని కళ్ళలోకి తన కళ్ళు పెట్టి పరీక్షగా చూసింది!!

❖